# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 14 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## జువైనల్ హోంలో దారుణం..

- ఆరుగురు బాలురపై పర్యవేక్షకుడి లైంగిక దాడి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని సైదాబాద్ జువైనల్ హోంలో దారుణం చోటుచేసుకుంది. చిన్నారులను సంరక్షించాల్సిన పర్యవేక్షకుడే కామాంధుడిగా మారి ఆరుగురు బాలురపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం ప్రకారం.. దసరా సెలవుల సందర్భంగా ఇంటికి వచ్చిన ఓ బాలుడు తిరిగి జువెనైల్ హోంకు వెళ్లనని ఏడుస్తూ నిరాకరించాడు. తల్లి అనుమానంతో ఆరా తీయగా షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. పర్యవేక్షకుడు తనపై అసహజ రీతిలో లైంగికదాడి చేసినట్టు బాలుడు తెలిపాడు.తల్లి వెంటనే సైదాబాద్ పోలీసులను ఆశ్రయించగా వారు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో మరో ఐదుగురిపైనా ఆ నిందితుడు లైంగిక దాడికి పాల్పడ్డాడని తేలింది. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నట్టు సమాచారం. ఈ ఘటనపై బాలల హక్కుల సంఘం కూడా సీరియస్‌గా వ్యవహరించి నివేదిక కోరినట్లు తెలిసింది.

## సంక్షేమ హాస్టళ్ల అత్యవసర ఖర్చులకు రూ.60 కోట్లు



- భోజనం, వేతనాలు, సదుపాయాలు, మరమ్మతులకు కేటాయింపు
- విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి ఫేషియల్ రికగ్నిషన్
- వైద్య కళాశాలలతో హాస్టళ్లకు లింక్
- విద్యార్థులకు వైద్య పరీక్షలు
- ఆహార నాణ్యత తనిఖీ
- సంక్షేమ వసతి గృహాల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 60 కోట్ల రూపాయలు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు, తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది.హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి గారు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా, జవాబు దారీతనం ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు."విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలి. విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి. దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలి.

హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలి. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలి. హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలి. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలి. అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలి.." అని ముఖ్యమంత్రి గారు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు, సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, నిర్మాణ ఖర్చులు, ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌ను ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. 24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్ టెక్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు.సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**స్వర్ణ పతకం సాధించిన జీవాంజి దీప్తికి సీఎం రేవంత్ అభినందనలు**

వర్ల్డ్ ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ – 2025 పోటీల్లో మహిళల విభాగం 400 మీటర్ల (టీ20) పరుగు పందెంలో సత్తా చాటి స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి జీవాంజి దీప్తిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక వర్ల్డ్ ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రికార్డు సమయంలో 55.92 సెకన్లలో లక్ష్యం చేరుకుని స్వర్ణం సాధించిన దీప్తి మరోసారి అంతర్జాతీయ వేదికపై తెలంగాణ కీర్తిని చాటారని ప్రశంసించారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తి యువతకు ఎంతో స్ఫూర్తిగా నిలుస్తున్నారని, ఆమె భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి గారు ఆకాంక్షించారు.



### రూ.251 కోట్లతో
## సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి

- వరంగల్ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- నాణ్యతతో పనులు పూర్తి చేయాలి
- మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క

**బలగం టీవీ, ములుగు**

మేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.251కోట్లు ఖర్చు చేయనున్నట్టు వరంగల్ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం ములుగు జిల్లా ఎస్‌ఎస్ తాడ్వాయి మండలం మేడారానికి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం చేరుకున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ దనసరి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌కి జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ శబరిష్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేడారంలో సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను వారు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి, సీతక్క మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ 90 రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. ఒకే సమయంలో గుడి నిర్మాణం, జాతర పనుల నిర్వహణ చేయాల్సి ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అనంతరం ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ.. గతంలో మేడారం జంపన్న వాగుపై వంతెన నిర్మాణం కేవలం 45 రోజుల్లో పూర్తి చేశారని, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి పనులు కూడా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.

**విజయవంతంగా పూర్తి చేస్తాం : మంత్రి పొంగులేటి**

అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 2026 జనవరిలో మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతుందని తెలిపారు. దేవతల సందర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి లోటు పాట్లు జరగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. మహా జాతర సమీపిస్తున్న నేపథ్యంలో సమ్మక్క-సారలమ్మ గద్దెల పునరుద్ధరణ అభివృద్ధి పనులను 90 రోజులలో పూర్తిచేసేలా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటికే గద్దెల ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడం కోసం రూ.101 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, మరో రూ.71 కోట్ల పనుల కోసం టెండర్లు పిలిచామని అన్నారు. సమ్మక్క సారలమ్మ దీవెనలతో మహా జాతరను విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. 2024లో జరిగిన జాతరకు విచ్చేసిన భక్తుల సంఖ్య కంటే 2026 జనవరిలో జరిగే మహా జాతరకు వచ్చే భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఈఎన్‌సీ, ఆర్డీఓ వెంకటేష్, పూజారులు, జిల్లా అధికారులు, ఆర్కిటెక్చర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు స్టేపై సుప్రీంలో పిటిషన్

- ఎస్‌ఎల్‌పీ దాఖలు చేసిన ప్రభుత్వం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెచ్చిన జీవో 9 పై హైకోర్టు స్టే విధించడాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. రిజర్వేషన్ల పెంపుకు సంబంధించి గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో పాటు, తాజాగా హైకోర్టు తీర్పును కాపీని జత చేసింది. ప్రధానంగా రిజర్వేషన్ల పెంపులో కీలకమైన ఇంద్ర సాహ్నీ వర్సెస్ యూనియన్ గవర్నమెంట్ తీర్పును రిఫరెన్స్ గా పిటిషన్ లో పేర్కొన్నట్లు సమాచారం. ఈ తీర్పు ప్రకారం... రిజర్వేషన్లు 50 శాతం క్యాప్ దాటొద్దని చెబుతోన్నా... అది కేవలం విద్యా, ఉపాధి రంగాలకే పరిమితం అని ప్రభుత్వం వాదించనుంది. అందువల్ల రాజకీయ రిజర్వేషన్లకు ఈ తీర్పు అడ్డంకి కాదని పిటిషన్ లో ప్రస్తావించింది. కాగా... ఇటీవల స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు ఉపసంహరించుకునేందుకు స్వేచ్ఛ నిస్తూ డిస్మిస్ చేసింది. ఇదే అంశంపై దాఖలైన పిటిషన్లపై ఈనెల 8,9 న తేదీల్లో సుదీర్ఘంగా విచారణ జరిపిన హైకోర్టు జీవో నెంబర్ 9పై స్టే విధించింది.

## సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యం వద్దు..

- గీత దాటితే వేటు తప్పదు
- డీజీపీ శివధర్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సివిల్ వివాదాల్లో పోలీసులు తలదూర్చవద్దని, సివిల్ వివాదా లను పరిష్కరించిన పోలీసు స్టేషన్లు, సంబంధిత అధికా రులపై తక్షణమే వేటు పడుతుందని డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు. హోం గార్డు నుంచి ఐపీఎస్ అధికారి వరకూ ఎవరూ సివిల్ వివాదాల్లో తల దూర్చవద్దని కోరుతూ రాష్ట్ర పోలీసులనుద్దేశించి రాసిన అంతర్గత లేఖలో శివధర్ రెడ్డి పేర్కొన్నారు. సివిల్ వివాదాలు సివిల్ కోర్టుల పరిధిలోకి వస్తాయన్న సంగతి ప్రతి పోలీసుకూ తెలుసునని, అయినా వాటిపై దృష్టి సారించే అధికారు లపై కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. పోలీసు యూనిఫామ్, అవినీతి కలిసి ఉండకూడదన్న డీజీపీ.. అవినీతి, అక్రమాలపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సిన పోలీసులే అవినీతికి పాల్పడితే ప్రజల్లో నమ్మకం పోతుందని చెప్పారు..

సివిల్ వివాదాల విషయంలో పోలీసులు జోక్యం చేసుకోవద్దని, సివిల్ వివాదాలను పరిష్కరించేందుకు ప్రయత్నించిన ఏ పోలీసు అధికారి అయినా సరే తక్షణమే 'వేటు' తప్పదని డీజీపీ శివధర్ రెడ్డి తీవ్రంగా హెచ్చరిం చారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర పోలీసులనుద్దేశించి రాసిన అంతరంగిక లేఖలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

హోం గార్డు నుంచి ఐపీఎస్ అధికారి వరకూ ఎవరూ సివిల్ వివాదాలలో తలదూర్చవద్దని డీజీపీ కోరారు. సివిల్ వివాదాలు సివిల్ కోర్టుల పరిధిలోకి వస్తాయన్న విషయం ప్రతి పోలీసు అధికారికి తెలుసునని, అయినప్పటికీ వాటిపై దృష్టి సారించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు.

పోలీసు యూనిఫామ్, అవినీతి కలిసి ఉండకూడదని డీజీపీ శివధర్ రెడ్డి ఉద్ఘాటించారు. అవినీతి, అక్రమాలపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సిన పోలీసులే అవినీతికి పాల్పడితే ప్రజల్లో నమ్మకం పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుని అవినీతికి పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

## ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియాన్, పీటర్ హోవిట్‌కి...



**బలగం టీవీ, స్టాక్‌హోమ్**

2025 ఆర్థిక శాస్త్ర నోబెల్ పురస్కారం ఈ ఏడాది జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియాన్, పీటర్ హోవిట్‌లకు కేటాయించబడిందని స్టాక్‌హోమ్‌లోని నోబెల్ కమిటీ వెల్లడి చేసింది. పురస్కారంలో సగం బహుమతిని మోకిర్కు, మిగతా సగం అఘియాన్, హోవిట్లకు భాగంగా కేటాయిస్తారని కమిటీ తెలిపారు.

నోబెల్ కమిటీ ప్రకటన ప్రకారం, మోకిర్ సాంకేతిక ప్రగతి ద్వారా సాధించగల సుస్థిర అభివృద్ధి అంశాలను గుర్తించి, ఆర్థిక రంగంలో దాని ప్రభావాన్ని వివరించినట్లు పేర్కొన్నారు. ఇక ఫిలిప్ అఘియాన్, పీటర్ హోవిట్‌లు క్రియేటివ్ డిస్ట్రక్షన్ సిద్ధాంతం ద్వారా వృద్ధి ప్రేరేపించే పద్ధతులను అభివృద్ధి చేసి, సుస్థిర ఆర్థిక ప్రగతికి కొత్త దిశను అందించారని కమిటీ తెలిపారు. ఈ అవార్డు ఆర్థిక శాస్త్ర రంగంలో సాంకేతికత, వినూత్న ఆలోచనల ప్రాముఖ్యతను మరోసారి స్పష్టం చేస్తోంది.




## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

- మొదలైన నామినేషన్ల పర్వం
- మొదటిరోజు 10 మంది అభ్యర్థుల నామినేషన్
- 21వరకు నామినేషన్లు స్వీకరణ, 22న పరిశీలన

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. నోటిఫికేషన్ విడుదల కావడంతో రిటర్నింగ్ అధికారి పి సాయిరాం నామినేషన్ల స్వీకరించారు. ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 03.00 గంటల వరకు పలువురు నామినేషన్లను దాఖలు చేశారు. ఈ ఉపఎన్నికకు తొలిరోజు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో రెండు రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు కాగా.. 8 స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. తెలంగాణా పునర్ నిర్మాణ సమితి తరుపున పూస శ్రీనివాస్ నామినేషన్ వేశారు. అలాగే నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాస రావు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్ర శేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్, సయ్యద్ ముస్తఫా హుస్సేన్, సల్మాన్ ఖాన్ లు నామినేషన్ లు దాఖలు చేశారు.

**రిటర్నింగ్ అధికారి కార్యాలయంను సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి**

జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలకు కొద్ది గంటల ముందు షేక్ పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంను జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంను సందర్శించారు.

**సన్నద్ధతను ఆర్ఓ, ఏఆర్ఓలతో సమీక్షించారు.**

నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ఈసీఐ నిబంధనలకు లోబడి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి నామినేషన్ ల స్వీకరణకు సర్వ సన్నద్ధం గా ఉండాలని రిటర్నింగ్ అధికారి పి సాయిరాం కు సూచించారు.

## ట్రాలీ ఆటో ఢీకొనడంతో చిన్నారి మృతి

- కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలో ఘటన



**బలగం టీవీ, కామారెడ్డి**

ట్రాలీ ఆటో ఢీకొని చిన్నారికి గాయాలు కాగా.. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చారు. మళ్లీ స్పృహ తప్పడంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈ విషాధ ఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ శివకుమార్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం అచ్చంపేట్ గ్రామానికి చెందిన మేదరి మధురశ్రీ (3) ఇంటి ముందర కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన ట్రాలీ ఆటోలో ఇంటికి వస్తుండగా.. మధురశ్రీ ఆకస్మాత్తుగా పరిగెత్తుకుంటూ వచ్చి ట్రాలీ ఆటో కింద పడింది. ఆటో వెనుక చక్రం బాలిక కాలు మీద నుంచి వెళ్లడంతో ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి చికిత్స చేసి.. మందులు రాసిచ్చి ఇంటికి పంపారు. ఇంటి వద్ద సంబంధిత వైద్యులు రాసిచ్చిన సిరప్ తాగించిన అనంతరం బాలిక స్పృహ కోల్పోయింది. వెంటనే కుటుంబ సభ్యులు మళ్లీ ఎల్లా రెడ్డిలోని అదే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి చిన్నారి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. బాలిక తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బాలిక మృతిచెందడంతో ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

## మాగంటి సునీతను గెలిపించాలి

- మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయండి
- బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో కారు కావాలా? బుల్డోజర్ కావాలా? మీరే నిర్ణయించుకోవాలని, హైడా రద్దు కావాలంటే జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ , ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లోని గ్రౌండ్‌లో కేటీఆర్ అధ్యక్షతన సోమవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ విజయానికి కసి, పట్టుదల, తపన అవసరమని, మన రక్తంలోనే పోరాటం ఉందని, ధైర్యంతో ముందుకు సాగాలని తెలిపారు. దివంగత మాగంటి గోపీనాథ్ చిన్న వయసులోనే కన్నుమూయడం బాధాకరమని, ఆయన ఆడబిడ్డలకు చిరు కానుకలు ఇచ్చి ఆదుకున్న కషిని గుర్తుచేశారు. అలాగే, ఆ కుటుంబానికి అండగా నిలవడం మనందరి బాధ్యత అన్నారు. కాంగ్రెస్ పాలనపై ఆగ్రహంతో ఉన్నవారు...రేవంత్‌రెడ్డిని తెలుగు భాషలో తిట్టరాని తిట్లు తిడుతున్నారని చెప్పారు. ధోకా తిన్న తెలంగాణకు ఇప్పుడు అవకాశం వచ్చిందని, ప్రతి ఇంటికి వెళ్లి నిజాలు చెప్పాలని, కాంగ్రెస్ మోసపూరిత పాలన బాకీ కార్డులను పంచాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 6 గ్యారంటీలు అమలు కావాలంటే, వద్ధులకు రూ.4000 పెన్షన్ రావాలంటే, దివంగత మాగంటి గోపీనాథ్ నియోజకవర్గంలో చేసిన అభివద్ధిని చూసి ప్రతి ఒక్కరూ ఓటు వేసి మాగంటి సునీత గోపీనాథ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జూబ్లీహిల్స్‌లో కొట్టే దెబ్బకు ఢిల్లీలో అధిష్టానం అదిరిపడాలన్నారు. అలాగే ఒకే ఇంటిలో 43 దొంగ ఓట్లు రాయించారని, మొత్తం కలిపి వేల సంఖ్యలో దొంగ ఓట్లు నమోదు చేయించారని ఆరోపించారు. దొంగ ఓట్లు పడకుండా చూడాలని సూచించారు. ఎస్పీఆర్ హిల్స్ లోని వాటర్ రిజర్వాయర్ మాగంటి గోపీనాథ్ పేరు పెట్టాలని, రిజర్వాయర్ ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారని చెప్పారు.

అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల ప్రజలు మోసపోయారని, ప్రభుత్వాన్ని బూడిద చేయాల్సిన అవసరం ఉందన్నారు. మరో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మాగంటి గోపీనాథ్ చేసిన అభివద్ధి, కేసీఆర్‌తో కలిసి నిధులను తెప్పించడంలో ఆయన పాత్ర గొప్పదన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ని మోసాలు చేసి గెలవాలని చూసినా బీఆర్‌ఎస్ కు ఓటు వేసి మాగంటి సునీత గోపీనాథ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని, మీపై మాకు నమ్మకం ఉందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సచ్చిపోయిందని, తనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం డబ్బులు డిమాండ్ చేసి అడిగారని, అందుకే తాను బీఆర్‌ఎస్‌లో చేరానని తెలిపారు. అనంతరం మాగంటి సునీత గోపీనాథ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం అంటేనే మాగంటి గోపీనాథ్ అని, ఇంతమంది కుటుంబ సభ్యులను తనకు అండగా ఉంచి ఆయన దివంగతులయ్యారని, మీరు నాకు అండగా ఉండి గెలిపించాలని కోరారు. మీ సమస్యలన్నీ పరిష్కరించేందుకు కషి చేస్తానని చెప్పారు. ఈ క్రమంలో ఆమె కన్నీరు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, దేదీప్య రావు, మాగంటి సునీతను ఓదార్చారు. ఎమ్మెల్యేలు పద్మారావు ,మల్లారెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్ల కుంభకోణం

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు
- ఎన్నికల సంఘానికి కేటీఆర్ ఫిర్యాదు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ చోరీ ఓట్లతో గెలుపు సాధించాలనే ప్రయత్నం చేస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రంగా విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఉన్న దొంగ ఓట్లు, డూప్లికేట్ పేర్లు, చిరునామా అవకతవకలపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు."జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఎట్లయినా గెలవాలనే తపనతో అన్ని అడ్డగోలు దారుల్లో పన్నాగాలు పన్నుతోంది. రాష్ట్ర మంత్రులు, నాయకులు అందరూ అక్కడే కేంద్రీకరించి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ప్రభుత్వం మళ్లీ ప్రజలను మోసం చేయాలని చూస్తోంది" అని కేటీఆర్ విమర్శించారు.

**20 వేల దొంగ ఓట్లు గుర్తింపు**

"మొత్తం 400 బూత్‌లలో కనీసం 50 దొంగ ఓట్లు ఉన్నాయి. అంటే సుమారు 20 వేల డూప్లికేట్ ఓట్లు కాంగ్రెస్ పార్టీ నమోదు చేసింది. ఒక్కో వ్యక్తికి మూడు వరకు ఓటర్ ఐడీలు ఉన్న ఉదాహరణలు ఉన్నాయి. చిన్న అక్షరాలు మార్చి, ఒకే చిరునామాతో అనేక సార్లు ఓట్లు చేర్చారు. ఒక చిన్న ఇంట్లోనే 150%-%200 ఓట్లు నమోదు చేయడం వంటి విచిత్ర సంఘటనలు చోటుచేసుకున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.తాము లేవనెత్తుతున్న ప్రతి అంశం కూడా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఉన్న డేటాపై ఆధారపడి ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. "ఇలాంటి అవకతవకలపై ప్రధాన ఎన్నికల అధికారి సమగ్ర దర్యాప్తు చేయాలి.

మిగితా 2వ పేజీలో




## హన్మకొండ కలెక్టరేట్‌లో మహిళా సిబ్బందిపై లైంగికదాడికి యత్నం

- **సీనియర్ అసిస్టెంట్ సస్పెండ్.**


**బలగం టీవీ, హన్మకొండ**

హన్మకొండ కలెక్టరేట్‌లో అత్యంత దారుణమైన ఘటన వెలుగు చూసింది. సాక్షాత్తు ప్రభుత్వ కార్యాలయంలోనే ఓ మహిళా ఉద్యోగిపై లైంగిక దాడికి ప్రయత్నించడం కలకలం రేపింది.

కలెక్టరేట్‌లోని ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇర్ఫాన్ సోహెల్ తన తోటి మహిళా సిబ్బందిపై లైంగికదాడి చేసేందుకు ప్రయత్నించాడు. అతని దాడి నుంచి చాకచక్యంగా తప్పించుకున్న బాధితురాలు వెంటనే సుబేదారి పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడైన ఇర్ఫాన్ సోహెల్‌పై కేసు నమోదు చేశారు. అతనిపై లైంగిక వేధింపులు మరియు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే నిందితుడు ఇర్ఫాన్ సోహెల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతటి దారుణానికి కలెక్టరేట్‌లోనే పాల్పడ్డాడంటే, ఇర్ఫాన్ సోహెల్‌కు ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

## చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో ఇవాళ ఉదయం 5.30 గంటలకు తుది శ్వాస విడిచారు. మధ్యాహ్నం 3 గంటలకు మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. కాంగ్రెస్ నేత అయిన కొండా లక్ష్మారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ సీఎం కొండా వెంకట రంగారెడ్డికి మనమడు. తాత ఆశయాలతో రాజకీయ జీవితంలోకి వచ్చిన ఆయన ఏపీసీసీ ప్రతినిధి, గ్రీవెన్స్ సెల్ చైర్మన్‌తో సహా వివిధ పదవులను నిర్వహించారు. ఏపీ క్రీడా మండలి చైర్మన్‌గా కూడా పనిచేశారు. 1999, 2014లో హైదరాబాద్ నుంచి కూడా పోటీ చేశారు.



## శతాబ్ది ఉత్సవాల్లో ఆర్.ఎస్.ఎస్. పథ సంచలన్‌కు సిరిసిల్ల మహిళల ఘన స్వాగతం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఆర్.ఎస్.ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలో నిర్వహించిన 'పథ సంచలన్' (రూట్ మార్చ్) కార్యక్రమానికి శాంతినగర్ ప్రాంతంలో అపూర్వ స్వాగతం లభించింది. పోకల భవాని ఆధ్వర్యంలో మహిళా బృందం స్వయంసేవకులకు సాదర పూర్వక స్వాగత ఏర్పాట్లు చేసి, ఘనంగా పలకరించింది. స్వయంసేవకులు పథ సంచలన్‌తో శాంతినగర్‌కు చేరుకోగానే, మహిళా బృందం మంగళహారతులతో, పూలవర్షంతో అంగరంగ వైభవంగా స్వాగతం పలికింది. దేశభక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ స్వాగత కార్యక్రమం అందరినీ ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో పోకల భవానితో పాటు రౌతు పూజిత, కమటం మంజుల, సోమిశెట్టి సౌజన్య, కొలుకూరి భూలక్ష్మి, చౌడు బోయిన కౌసల్య, లతా, నవీన, వనిత, మల్లీశ్వరి, రేవతి, విజయ, గూట్ల అనుష తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.25 లక్షల నగదు స్వాధీనం

**బలగం టీవీ, హైదరాబాద్**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఎన్నికల తనిఖీల్లో భాగంగా స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ రూ.25,00,000 (ఇరవై ఐదు లక్షలు) నగదును స్వాధీనం చేసుకుంది. ఈ నగదు శ్రీ జైరాం తలాసియా అనే వ్యక్తి నుండి స్వాధీనం చేయబడింది. ఆయన విశాఖపట్నం జిల్లాలోని సీతమ్మధర ఎన్.ఈ లేఅవుట్, ఫ్లాట్ నెం.194 నివాసి. ఆయన టీఎస్09 ఎఫ్ఎఫ్ 6111 నంబర్ గల కారు ద్వారా యూసుఫ్‌గూడ వైపు ప్రయాణిస్తుండగా, మైత్రీవనం ఎక్స్ రోడ్ వద్ద సారథి స్టూడియో సమీపంలో ఎస్ఎస్‌టీ బృందం తనిఖీ చేయగా, రూ.25 లక్షల నగదు లభ్యమైంది.ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా స్వాధీనం చేసిన నగదును స్థానిక, పోలీస్ స్టేషన్ , మధురానగర్ కు అప్పగించారు.

## మహాశివరాత్రి వరకు దర్శనాలు కొనసాగించాలి

- **కార్తికమాసం సమ్మక్క సారక్క శివరాత్రి జాతర తర్వాత రాజన్న ఆలయ అభివృద్ధిని కొనసాగిస్తూ పనులు చేయండి..**
- **5000 కుటుంబాల చిరువ్యాపారుల పొట్టకొట్టొద్దు**
- **భీమన్నగుడి ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేసిన తర్వాతే అక్కడ దర్శనాలు కొనసాగించాలి**
- **బీఆర్ఎస్ నాయకులు**



**బలగం టీవీ, వేములవాడ**

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి పనుల విషయంలో రాజకీయ దుమారం రాజుకుంది. ఆలయ అభివృద్ధిలో భాగంగా రాజన్న దర్శనాలను నిలిపివేసి, పక్కనే ఉన్న భీమేశ్వరాలయంలో తాత్కాలికంగా దర్శనాలు, ఆర్జిత సేవలు ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు.

మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పట్టణ సీనియర్ నాయకులు నిమ్మశెట్టి విజయ్ మాట్లాడుతూ.. సమ్మక్క-సారక్క, మహాశివరాత్రి జాతరలు పూర్తయిన తర్వాతే ప్రధాన ఆలయాన్ని మూసివేసి అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. కార్తీక మాసం, సమ్మక్క-సారక్క, మహాశివరాత్రి జాతర వంటి ముఖ్యమైన పర్వదినాలు, జాతరలు పూర్తయిన తర్వాతే రాజన్న ఆలయాన్ని మూసివేసి అభివృద్ధి పనులు మొదలుపెట్టాలని నిమ్మశెట్టి విజయ్ డిమాండ్ చేశారు.

రాజన్న భక్తులపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 5000 కుటుంబాల చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దని, హడావుడిగా ఆలయాన్ని మూసివేస్తే వారి జీవనోపాధి దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. తాత్కాలికంగా దర్శనాలు ఏర్పాటు చేసిన భీమేశ్వరాలయంలో భక్తులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించకుండా దర్శనాలు ఎలా ప్రారంభిస్తారని నిమ్మశెట్టి విజయ్ ప్రశ్నించారు. పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసిన తర్వాతే ఇక్కడ దర్శనాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఏర్పాట్లు పూర్తికాకముందే దర్శనాలు కల్పిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆలయాన్ని ఎలా అభివృద్ధి చేస్తారో, ఎంత కాలంలో పూర్తి చేస్తారో తెలిపే డిపిఆర్ వివరాలను ఇప్పటివరకు పట్టణ ప్రముఖులకు, మీడియాకు, ప్రజలకు తెలియజేయకపోవడంపై స్పష్టత కోరారు.

రాజన్న దర్శనాలు నిలిపివేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని, అధికారులు చెబుతున్నట్టుగా 'పూజలు కొనసాగిస్తున్నాం' అనడం కాదని, భక్తులకు ఈ మహాశివరాత్రి వరకు దర్శనాలు కల్పించాలని అన్నారు. నిమ్మశెట్టి విజయ్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి భీమేశ్వరాలయంలో భక్తులకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కోడె మొక్కు, అర్జిత సేవల వసతులను పరిశీలించారు, వసతులు లేవని నిరసన వ్యక్తంచేశారు.

బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మి నరసింహారావు కూడా ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినప్పటికీ, స్థానిక అధికారులు, నాయకులు పట్టించుకోకుండా పెడచెవిన పెడుతున్నారని నిమ్మశెట్టి విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఎందుకు మీకు అంత తొందర%ౌ%ఇంకా మీకు ఏంతో సమయం ఉంది" అంటూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒకవైపు ఆధికారులు ఆలయ మూసి వేయం ఆనీ చెప్తూనే మరో వైపు బీమన్న గుడిలో ఆన్నీ ఏర్పాట్లు చేస్తున్నాం కోడె మొక్కులు, ఆర్జిత సేవలు, అభిషేకలు చేసుకోవచ్చు అనడం సరికాదన్నారు. స్వామి వారికి కైంకర్యాలు,పూజాలు ఆపడం లేదని చెప్పడం కాదు రాజన్న భక్తులకు ఈ మహాశివరాత్రి వరకు దర్శనాలు కల్పించాలని విజయ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు మారం కుమార్, సిరిగిరి రాంచందర్, గోలి మహేష్, జోగిని శంకర్, నాయకులు గన్నమనేని రామరావు, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, సత్తిరెడ్డి, నీరటి మల్లేశం, గుడిసె సదానందం, రాంబాబు, చేపూరి రవి, పైడి శ్రీనివాస్, గజ్జెల రమేష్, సందీప్, పోతు అనిల్, వాసాల శ్రీనివాస్, పందుల శ్రీనివాస్, ఆసద్, రాకేష్, రావికంటి, దేవరాజు, చింతపంటి సాయి, సుంకపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో పంచాయతీ కార్మికుడు మృతి..



- **రూ.10 లక్షల సాయం, ఉద్యోగం ఇవ్వాలని సీపీఐ(ఎం) డిమాండ్..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గంభీరావుపేట గ్రామంలో పనిచేస్తూ విధి నిర్వహణలో దురదృష్టవశాత్తు మరణించిన గ్రామపంచాయతీ కార్మికుడు రమేష్ కుటుంబానికి తక్షణమే ప్రభుత్వం రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట గ్రామంలో గ్రామపంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న రమేష్ నిన్నటి రోజున పనిలో భాగంగా చెరువులోని బావిలో నీటి పంపు రిపేరు చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మరణించారు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది. ఆదివారం రోజున ఆసుపత్రి వద్దకు సీపీఎం నాయకులు, గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో చేరుకుని, రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్మికుల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్కలేనట్టుగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులో ఉన్న బావి దగ్గరికి వెళ్లడం ప్రమాదకరమని తెలిసినా, అధికారులు బలవంతంగా రమేష్‌ను పని చేయాలని పంపించడం వలనే మరణం సంభవించిందని, రమేష్ మరణానికి పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలి అని స్పష్టం చేశారు. "ఇంత ఘోర ప్రమాదం జరిగినా జిల్లా కలెక్టర్ వచ్చి కుటుంబాన్ని పరామర్శించిన దాఖలాలు లేవు. ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. అణగారిన వర్గాల వారు అయినందున వారి ప్రాణాలకు విలువలు లేవా?" అని ప్రశ్నించారు. తక్షణమే రమేష్ కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రమేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా గ్రామపంచాయతీ కార్మికులకు తగిన భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికులందరూ పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతారని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షులు మల్యాల నరసయ్య, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు వర్కోలు మల్లయ్య, తంగళ్ళపల్లి మండల అధ్యక్షులు బూర శ్రీనివాస్, గంభీరావుపేట్ మండల అధ్యక్షులు ఆంజనేయులు, ముస్తాబాద్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వేములవాడ రూరల్ మండల అధ్యక్షులు మహేష్, చీర్లవంచ రవి తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్ల కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

ఈ దొంగ ఓట్ల ఆధారంగా కాంగ్రెస్ పార్టీ గెలవాలనుకోవడం ప్రజాస్వామ్యానికి ముప్పు" అని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ కింది స్థాయి ఎన్నికల అధికారులతో కుమ్మక్కై దొంగ ఓట్లు చేర్చిందని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటికే 12 వేల ఓట్లను తొలగించినప్పటికీ, అదనంగా 7 వేల కొత్త ఓట్లు చేర్చారని చెప్పారు. మొత్తం 19 వేల ఓట్లు అనుమానాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. "దొంగ ఓట్లతో గెలవాలన్న కాంగ్రెస్ కుట్రను ప్రజల మధ్య ఎండగడతాం" అని హెచ్చరించారు.



# రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం

- **వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి ఒక్కరి ఎజెండా కాదు, రాజన్న భక్తుల ఎజెండా..**
- **రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో అభివృద్ధి, విస్తరణ పనులు ప్రారంభమయ్యాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ రాజన్న అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని, మొత్తం రూ. 150 కోట్లతో ఈ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే రూ. 47 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. శృంగేరి పీఠాధిపతులు, ఆగమ శాస్త్రం ప్రకారం రాజన్న ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు.



వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అత్యంత ప్రాచీనమైన భీమేశ్వర ఆలయంలో ప్రత్యామ్నాయంగా ఆర్జిత సేవలు ఏర్పాటు చేశామని తెలిపారు. భీమేశ్వర ఆలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి రూ. 3 కోట్ల 40 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. పట్టణ ప్రజలు, ప్రముఖులు, ఆలయ పరిరక్షణ సమితి సభ్యుల సూచనలు, సలహాలు ఇదివరకే తీసుకున్నామని, ఇవాళ సూచించిన అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాజన్న ఆలయంలో సుమారు 64 నుండి 70 పిల్లర్లతో మండపాల నిర్మాణం జరపాల్సి ఉందని, ఈ క్రమంలో పెద్ద పెద్ద మిషన్స్ ఉపయోగించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, భద్రత కోసం ప్రత్యామ్నాయంగా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని, భక్తులు గమనించాలని కోరారు. "రాజన్న ఆలయం బంద్" అనేది అవాస్తవమని, స్వామి వారికి జరిగే నిత్య పూజలు ఏకాంతంగా యథావిధిగా జరుగుతాయని స్పష్టం చేశారు.

"రాజన్న ఆలయ అభివృద్ధి ఒక్కడి ఏజెండా కాదు, ఇది రాజన్న భక్తుల ఎజెండా" అని విప్ ఆది శ్రీనివాస్ ఉద్ఘాటించారు. రాబోయే 100 సంవత్సరాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించడానికి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇల్లు నిర్మాణం జరిగేటప్పుడు ఇంట్లోనే ఉంటామా, ఆలోచన చేయాలని, భక్తుల కోసం ఎవరు ఎలాంటి సూచనలు చేసినా తప్పకుండా గౌరవిస్తామని అన్నారు.

వేములవాడ రాజన్న ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని ప్రభుత్వ విప్ తెలిపారు. "రాజన్న ఆలయం బంద్ అనేది అవాస్తవం. స్వామి వారికి జరిగే నిత్య పూజలు ఏకాంతంగా యథావిధిగా జరుగుతాయి. ఆలయంలో పనులు జరిగే క్రమంలో భక్తుల భద్రత (సేఫ్టీ) కోసం మాత్రమే ప్రత్యామ్నాయంగా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశాము. భక్తులు ఈ విషయాన్ని గమనించాలి," అని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఫ్లాగ్ డే" సందర్భంగా విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు

- **ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం "పోలీస్ ఫ్లాగ్ డే " సందర్భంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన ధైర్యవంతులైన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీ నిర్వహించడం జరుగుతుందని జ ఎస్పీ ఎస్పీ మహేష్ బి. గితే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ ఈ పోటీలు మూడు భాషల్లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో6 వ తరగతి నుండి పీజీ వరకు ఉన్న విద్యార్థులు పాల్గొనవచ్చని అన్నారు. విద్యార్థులు తమ వ్యాసాలను అక్టోబర్ 28 వ తేదీ లోగా సమర్పించాలని,ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. అంతే కాకుండా జిల్లా స్థాయిలో 1వ, 2వ, 3వ స్థానాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయబడతాయని,విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా,రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి బహుమతులు పొందాలని అన్నారు.. డ్రగ్స్ నివారణలో పోలీ సుల పాత్ర మరియు విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు అనే వ్యాసారాస అంశంపై వ్యాసాన్ని పేపర్‌పై రాసి, దానిని చిత్రం లేదా పి డి ఎఫ్ ఫార్మాట్‌లో 500 పదాలు మించకూడా https://forms.gle/jaWLdt2yhNrMpe3eA ఈ లింకులో అప్‌లోడ్ చేసి సబ్మిట్ చేయాలని, దానితోపాటు మీ పేరు, విద్యార్హత మరియు ఇతర వివరాలు నమోదు చేయాలని తెలిపారు.



# వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**బలగం టీవీ, నేరాళ్ల**

నేరాళ్ల పాక్స్ పరిధిలోని జిల్లెళ్ళ, నేరళ్ల, చిన్న లింగపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను పాక్స్ చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాక్స్ డైరెక్టర్స్ అనిల్ రెడ్డి, రాజిరెడ్డి, గణేష్ గౌడ్, రవీందర్ రావు, నారాయణ గౌడ్, పొన్నాల కిషన్, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు లింగారెడ్డి, రవి, శ్రీనివాస్ గౌడ్, శోభా, పాక్స్ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **కలెక్టర్ ఎం.హరిత**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఎం.హరిత పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ప్రజావాణికి మొత్తం 81 దరఖాస్తులు వచ్చాయి.



కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వేదికపై సిరిసిల్ల సత్తా..

- **తెలంగాణ ఈవీ ఆవిష్కరణలను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లిన గ్రావ్టన్ మోటార్స్ వ్యవస్థాపకుడు**
- **కేటీఆర్ ప్రశంస**
- **దేశానికే ఆదర్శంగా టీ-హబ్, టీ-వర్క్స్ యువతకు స్ఫూర్తినిచ్చిందన్న మాజీ మంత్రి**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలోని ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఆవిష్కరణలను అంతర్జాతీయ వేదికకు తీసుకెళ్లిన సిరిసిల్ల బిడ్డ, గ్రావ్టన్ మోటార్స్ వ్యవస్థాపకుడు పర్శురామ్ పాకను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.టి. రామారావు (కేటీఆర్) అభినందించారు. ఒక ఆవిష్కర్తకు ప్రేరణనిచ్చే ఎకో సిస్టం లభించినప్పుడు అద్భుతాలు జరుగుతాయని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. పర్శురామ్ పాక వంటి ప్రతిభావంతులను పోషించడంలో తెలంగాణలోని ఆవిష్కరణల కేంద్రాలైన టీ–హబ్ మరియు టీ–వర్క్స్ పాత్ర కీలకమని ఆయన కొనియాడారు.



**సిరిసిల్ల నుండి ప్రపంచ స్థాయికి..**

"సిరిసిల్లకు చెందిన పర్శురామ్ పాక ఒక స్ఫూర్తిదాయక ఉదాహరణ. ఇంజనీరింగ్‌లో నేపథ్యం, అమెరికాలో అనుభవం ఉన్న ఆయన, మన ఇంక్యుబేటర్ల వద్ద ఉన్న అత్యాధునిక సౌకర్యాలను ఉపయోగించుకుని గ్రావ్టన్ మోటార్స్‌ను స్థాపించారు. నేడు ఈ సంస్థ తెలంగాణ నుంచే ప్రపంచ స్థాయి ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను తయారు చేస్తోంది" అని కేటీఆర్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. గ్రావ్టన్ మోటార్స్ తమ మోటార్లు, బ్యాటరీలు, కంట్రోల్ సిస్టమ్స్‌ను పూర్తిగా దేశీయంగా రూపొందించి, తయారు చేసిందని మాజీ మంత్రి తెలిపారు. ఇది నిజమైన 'మేడ్–ఇన్–ఇండియా, మేడ్–ఫర్–ది–వరల్డ్' విజయగాథ అని అభివర్ణించారు.

**కే2కే ప్రపంచ రికార్డ్, అంతర్జాతీయ విస్తరణ**

గతంలో గ్రావ్టన్ మోటార్స్ సంస్థ 4,000 కిలోమీటర్ల కశ్మీర్–టు–కన్యాకుమారి రైడ్‌ను పూర్తి చేసి ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ప్రస్తుతం ఈ కంపెనీ కెన్యా, ఫిలిప్పీన్స్, పెరూ వంటి దేశాలకు తమ కార్యకలాపాలను విస్తరిస్తోందని కేటీఆర్ గుర్తు చేశారు.

శుక్రవారం కోయంబత్తూరులో పర్శురామ్ పాకను కలిశానని, వారి కంపెనీ ప్రయాణం, విజయాలు తనను ఎంతగానో ప్రేరేపించాయని కేటీఆర్ తెలిపారు. "ఇది నాకు నిజంగా అవసరమైన ఎనర్జీ బూస్టర్! పర్శురామ్ మరియు గ్రావ్టన్ మోటార్స్ ఈవీ బృందానికి అభినందనలు. మీ కథ మరెందరికో స్ఫూర్తినివ్వాలని కోరుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆవిష్కరణల వ్యవస్థ స్థానిక మేధస్సును అంతర్జాతీయ ప్రభావిత శక్తిగా మారుస్తూ, భారతదేశ ఈవీ విప్లవాన్ని ఎలా ముందుకు నడిపిస్తోందో ఈ విజయాలు నిరూపిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# రాజన్న దర్శనాల నిలిపివేతపై సిరిసిల్ల బీజేపీ నిరసన..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనాలను నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, ఈరోజు సిరిసిల్ల పట్టణ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. జిల్లా పార్టీ ఆదేశాలు మరియు గౌరవ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ, అభివృద్ధి పేరుతో రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో దర్శనాలను నిలిపివేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. "మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు, కానీ భక్తుల మనోభావాలను దెబ్బతీయడం అన్యాయం. రాజన్న అనేది బీదల దేవుడు ం ఆయన నిత్య దర్శనాలకు అడ్డంకులు లేకుండా అభివృద్ధి జరగాలి" అని ఆయన డిమాండ్ చేశారు. హిందూ భక్తుల మనోభావాలను గౌరవించాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేని పక్షంలో, "ఆలయ తలుపులు బద్దలు కొట్టి అయినా స్వామివారి దర్శనాలు ప్రారంభం అయ్యేలా చేస్తాం" అని దుమాల శ్రీకాంత్ తీవ్రంగా హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా బీజేవైఎం మాజీ అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు శ్రీ వోరగొండ రాజు, పల్లికొండ నర్సయ్య, మోర శ్రీహరి, మెరుగు శ్రీనివాస్, రచ్చ రాహుల్, సిద్ధి దేవరాజు, కనకయ్య, గాలి శ్రీనివాస్, దూరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయం అంచున భారత్

**సిరీస్ విజయానికి 58 పరుగుల దూరంలో.. సిరీస్ విజయానికి 58 పరుగుల దూరంలో..**





- రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌటైన వెస్టిండీస్
- భారత్ లక్ష్యం 121
- నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 63/1

బలగం టీవీ, హైదరాబాద్

వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. 121 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. విజయానికి ఇంకా 58 పరుగులు మాత్రమే అవసరం. క్రీజులో కేఎల్ రాహుల్ (25 బ్యాటింగ్), సాయి సుదర్శన్ (30 బ్యాటింగ్) అజేయంగా ఉన్నారు.

దూకుడుగా ఆడే క్రమంలో యశస్వీ జైస్వాల్ (8) వారికన్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత సాయి–రాహుల్ జాగ్రత్తగా ఆడి మరో వికెట్ కోల్పోకుండా రన్స్ జోడించారు.

**పోరాడిన విండీస్ బ్యాటర్లు**

173/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులకే ఆలౌట్ అయింది. జాన్ కాంప్‌బెల్ (115), షైహోప్ (103) సెంచరీలతో చెలరేగారు. చివర్లో జస్టిన్ గ్రీవ్స్ (50 నాటౌట్), జైడెన్ సీల్స్ (32) చివరి వికెట్‌కు 79 పరుగులు జోడించి స్కోరును 350 దాటించారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా (3/44), కుల్దీప్ యాదవ్ (3/104) మూడేసి వికెట్లు, మహమ్మద్ సిరాజ్ (2/43) రెండు వికెట్లు, జడేజా%-%సుందర్‌కు చెరో వికెట్ దక్కాయి.

**చెమటోడ్చిన భారత బౌలర్లు**

వెస్టిండీస్ బ్యాటర్లను ఆలౌట్ చేయడానికి భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. కాంప్‌బెల్–హోప్ జోడీని విడదీసేందుకు కష్టపడ్డారు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడంతో విండీస్ బలమైన పోరాటం చేసింది. అయితే రెండో సెషన్‌లో సిరాజ్ షైహోప్ వికెట్ తీసిన తర్వాత విండీస్ బ్యాటింగ్ కుదేలైంది. రోస్టన్ ఛేజ్ (40), టెవిన్ ఇమ్లాచ్ (12), ఖారీ పీర్రె (0)లను కుల్దీప్ ఔట్ చేయగా, బుమ్రా చివరి రెండు వికెట్లు పటాపంచలు చేశాడు. చివర్లో గ్రీవ్స్ ఒంటరిగా పోరాడినా, సీల్స్ ఔట్ కావడంతో విండీస్ ఇన్నింగ్స్ ముగిసింది.



## ఉత్కంఠ భరిత పోరులో సఫారీల గెలుపు

బలగం టీవీ, హైదరాబాద్

మహిళల ప్రపంచకప్ ఉత్కంఠ భరిత పోరాటాలతో రసవత్తరంగా కొనసాగుతోంది. భారత్‌పై చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ డీక్లెర్క్ (37 నాటౌట్) మరోసారి ఒత్తిడిలోనూ చెలరేగి, బంగ్లాదేశ్‌పై జట్టును విజయతీరాలకు చేర్చింది. చివరి ఓవర్లో 8 పరుగులు అవసరమైన సమయంలో డీక్లెర్క్ ఫోర్, సిక్స్‌లతో దక్షిణాఫ్రికాకు మూడు వికెట్ల తేడాతో గెలుపు కట్టబెట్టింది. బంగ్లా జట్టు అద్భుతంగా బౌలింగ్ చేసినా, కీలక క్షణాల్లో క్యాచ్‌లు వదిలేయడం మూలంగా విజయం చేజారింది.

**బంగ్లా బౌలింగ్‌కి సఫారీలు చెమటలు**

స్వల్ప లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు కష్టాల్లో పడ్డారు. బంగ్లాదేశ్ స్పిన్నర్లు పట్టు సాధించడంతో 15వ ఓవర్లోనే వోల్వార్ట్ (31) రనౌట్ అయింది. ఆరుసార్లు మారిన మ్యాచ్‌లో మరినే కాప్ (56), చోలే ట్రయాన్ (62) అద్భుత భాగస్వామ్యంతో జట్టును నిలబెట్టారు. చకచకా సింగిల్స్ తీస్తూ స్కోరు 130 దాటించారు. 40వ ఓవర్లో సిక్స్, ఫోర్‌తో మరినే హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకుంది. నహిదా బౌలింగ్‌లో మరినే వికెట్ కోల్పోయినా, ట్రయాన్ ఫిఫ్టీతో సఫారీలను రేసులో ఉంచింది. అయితే క్విక్ సింగిల్ ప్రయత్నంలో ట్రయాన్ రనౌట్ కావడంతో ఉద్విగ్న పరిస్థితి నెలకొంది.ఆ తర్వాత డీక్లెర్క్–మసబతా క్లాస్ జంటగా జట్టు ఆశలను నిలబెట్టారు. 48వ ఓవర్లో షోర్నా వదిలేసిన క్యాచ్ బంగ్లాదేశ్‌కు భారీ మూల్యం చెల్లించింది. చివరి ఓవర్లో 8 పరుగులు అవసరమైన సమయంలో తొలి బంతికే డీక్లెర్క్ బౌండరీ కొట్టి, మూడో బంతిని సిక్సర్‌గా పంపడంతో మ్యాచ్ ముగిసింది.

**షోర్నా, షమీన్ ఫిఫ్టీలతో మెరుపులు**

బ్యాటింగ్‌లో తరచూగా విఫలమవుతున్న బంగ్లాదేశ్ ఈసారి ఆకట్టుకుంది. టాప్‌ఆర్డర్ మంచి ఆరంభం ఇచ్చి, మిడిల్‌ఆర్డర్ బాధ్యతా యుతంగా ఆడింది. షోర్నా అక్తర్ (51 నాటౌట్), షమీన్ అక్తర్ (50) అర్ధశతకాలతో జట్టును గౌరవప్రద స్కోరుకు చేర్చారు. డెత్ ఓవర్లలో షోర్నా, రీతూ మోని (19 నాటౌట్) బౌండరీలతో చెలరేగారు. వీరిద్దరూ చివర్లో 27 పరుగులు జోడించగా, బంగ్లాదేశ్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 232 పరుగులు చేసింది.బౌలర్లతో కట్టుదిట్టంగా ఆడిన బంగ్లా జట్టు చివర్లో ఫీల్డింగ్‌లో తప్పిదాలు చేయడం మూలంగా గెలుపును కోల్పోయింది. దక్షిణాఫ్రికా జట్టు వరుసగా రెండో విజయంతో సెమీఫైనల్ బరిలోకి దూసుకెళ్లింది.

## సిద్ధుజొన్నలగడ్డ తెలుసు కదా ట్రైలర్ విడుదల




బలగం టీవీ, హైదరాబాద్

యంగ్ హీరో సిద్ధుజొన్నలగడ్డ నటిస్తున్న తాజా రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'తెలుసుకదా'పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమాను నీరజ కోన దర్శకత్వం వహిస్తుండగా, హీరోయిన్‌లుగా శ్రీనిధి శెట్టి, రాశీఖన్నా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేసింది.

"నువ్వే రోజు నీ ఆడదానికెళ్లి నీ కన్నీళ్లు, నీ బాధ చూపిస్తావ్.. ఆ రోజు నువ్వే నీ జుట్టు తీసుకెళ్లి దాని చేతిలో పెట్టినోడివవ్ బ్రదర్... ఆ కంట్రోల్ ఎప్పుడూ వాళ్లకివ్వొద్దు.. పవర్ సెంటర్ ఎప్పుడూ ఇక్కడే ఉండాలి" అంటూ సిద్ధు స్టైల్‌లో చెప్పిన మాటలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. "ఎవరిని ప్రేమించాలి.. ఎంత ప్రేమించాలి.. ఎలా ప్రేమించాలి అనేది మన కంట్రోల్‌లో ఉండాలి" అంటూ సిద్ధు చెప్పున్న మరో డైలాగ్ కూడా సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తోంది. "నిన్న చూస్తే భయమేస్తుంది" అని రాగా (శ్రీనిధి శెట్టి) చెప్తుంటే, "భయపడు అయితే" అంటూ సిద్ధు కౌంటర్ ఇవ్వడం ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. "నిన్ను చేసుకుంటే నా లైఫ్ బాగుంటుందా?" అని అంజలి (రాశీఖన్నా) అడుగుతుంటే, "నీకు గ్యారంటీ, వారంటీలు ఇవ్వడానికి నేనేం సేల్స్‌మెన్ కాదమ్మా" అంటూ సిద్ధు చెప్పిన మాటలు థియేటర్లలో హంగామా చేయనున్నాయి. ట్రైలర్ చూసి సినిమా ఒక ట్రయాంగిల్ లవ్ స్టోరీ నేపథ్యంపై సాగబోతోందని స్పష్టంగా అర్థమవుతోంది.

ఈ చిత్రంలో వైవా హర్ష కీలక పాత్రలో నటిస్తుండగా, నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఎడిటర్ నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎస్.థమన్ సంగీతాన్ని అందిస్తుండగా, స్టైలిష్‌గా పేరుగాంచిన నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఈ రొమాంటిక్ డ్రామా అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.




## 'ఆంధ్ర కింగ్ తాలుకా' టీజర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

యంగ్ హీరో రామ్ పోతినేని నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలుకా' టీజర్ విడుదలైంది. ఈ చిత్రంలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన ఒక స్టార్ హీరోగా కనిపించగా, రామ్ అతని అభిమానిగా నటిస్తున్నాడు. తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై భారీ అంచనాలు పెంచుతోంది.

టీజర్‌లో రామ్ తన అభిమాన హీరో కోసం ఎంతదూరమైన వెళ్ళే ఫ్యాన్‌గా కనిపించాడు. హీరో కోసం ఫైట్లు చేయడం, థియేటర్ వద్ద గోల చేయడం వంటి సన్నివేశాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేతో ఉన్న రొమాంటిక్ సీన్స్ కూడా అందరినీ ఆకర్షిస్తున్నాయి. టీజర్ చివర్లో రామ్ చెప్పిన డైలాగ్ "ఫ్యాన్.. ఫ్యాన్ అని నువ్వు గుద్దలు చించుకోవడమే కానీ, నువ్వు ఒకడివి ఉన్నావని కూడా నీ హీరోకి తెలియదు.. ఏం బతుకులురా మీవీ.. ఛీ!" ప్రేక్షకుల మనసులను తాకింది. మొత్తానికి టీజర్ ఎనర్జిటిక్‌గా ఉండడంతో, రామ్ అభిమానులు ఈ సినిమాతో తమ హీరోకి సూపర్‌హిట్ దక్కుతుందని ఆశిస్తున్నారు. ఈ చిత్రానికి మహేశ్‌బాబు పి దర్శకత్వం వహించగా, ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మాణం చేపట్టారు. మురళీ శర్మ, రాహుల్ రామకృష్ణ, విటివి గణేష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'ఆంధ్ర కింగ్ తాలుకా' నవంబర్ 28న థియేటర్లలో సందడి చేయనుంది.

## 'దేవర' బుల్లితెరపైకి..

- అక్టోబర్ 26న ప్రీమియర్

బలగం టీవీ, హైదరాబాద్




యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర: పార్ట్ 1' ఇప్పుడు టెలివిజన్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. గత ఏడాది సెప్టెంబరులో థియేటర్లలో విడుదలై మంచి స్పందన తెచ్చుకున్న ఈ చిత్రం, ఓటీటీలో సక్సెస్‌ఫుల్‌గా ట్రెండ్ అయినప్పటికీ ఇప్పటి వరకు బుల్లితెరపై ప్రసారం కాలేదు. ఇక తాజాగా అభిమానుల ఎదురుచూపులకు తెరపడింది.తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో 'దేవర' టీవీలో ప్రసారంకానుంది. ఈ చిత్రానికి సంబంధించిన శాటిలైట్ హక్కులను జియో స్టార్ సంస్థ పొందింది. ఇందులో భాగంగా వివిధ భాషలలోని ప్రముఖ ఛానళ్లలో ఈ చిత్రం టెలికాస్ట్ కానుంది.తెలుగులో స్టార్ మా, హిందీలో స్టార్ గోల్డ్, తమిళంలో విజయ్ టీవీ , కన్నడలో స్టార్ సువర్ణ, మలయాళంలో ఏషియానెట్ లలో ప్రసారమవుతుంది. హిందీ ప్రీమియర్ డేట్‌గా అక్టోబర్ 26 అధికారికంగా ఖరారైంది. మిగతా భాషల్లో టెలికాస్ట్ తేదీలు త్వరలో వెల్లడించనున్నారు.

## ముద్దు సీన్లతో భయం.. తల్లిదండ్రుల సమాధానంతో షాక్

- సోనమ్ బజ్వా

బలగం టీవీ, హైదరాబాద్



తెలుగు ప్రేక్షకులకు 'బాబు బంగారం' చిత్రంలోని ప్రత్యేక గీతం, 'ఆటాడుకుందాం రా' సినిమాతో పరిచయమైన పంజాబీ నటి సోనమ్ బజ్వా, తన సినీ కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న ఓ ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. ముఖ్యంగా సినిమాల్లో ముద్దు సన్నివేశాల్లో నటించడం పట్ల తానెదుర్కొన్న సంఘర్షణ, ఆ విషయంలో తల్లిదండ్రుల స్పందన తనను ఎలా ఆశ్చర్యానికి గురిచేసిందో తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె వివరించారు. "కెరీర్ ప్రారంభంలోనే ముద్దు సన్నివేశాలు ఉన్నాయనే కారణంతో చాలా హిందీ సినిమాలను వదులు కున్నాను. అలాంటి సీన్లు చేస్తే పంజాబీ ప్రేక్షకులు నన్ను ఎలా చూస్తారో, నా కుటుంబ సభ్యులు అర్థం చేసుకుంటారా? అనే భయం ఉండేది" అని సోనమ్ తెలిపింది. ఆ సందేహాలన్నీ ఒక రోజు తల్లిదండ్రుల ముందుంచినట్లు చెబుతూ, "అప్పుడు వారు 'సినిమా కోసమే కదా అలా చేసేది, దాంతో సమస్యేముంది?' అని చాలా సింపుల్‌గా చెప్పారు. వారి స్పందన విని నేను షాక్ అయ్యాను. ఇన్ని రోజులు ఈ విషయం గురించి వాళ్లతో మాట్లాడకపోవడం పట్ల నాకే ఆశ్చర్యమేసింది. ఆ మాటల తర్వాత నా భయాలన్నీ పూర్తిగా పోయాయి" అని ఆమె వెల్లడించింది.ప్రస్తుతం సోనమ్ బజ్వా, నటుడు హర్షవర్ధన్ రాణే సరసన నటించిన 'ఏక్ దీవానే కీ దీవానియత్' అనే హిందీ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.

## నేడు "మీసాల పిల్ల" సాంగ్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు' సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తుండగా, సుస్మిత కొణిదెల, సాహు గారపాటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తోంది. ఇటీవల ఈ సినిమా నుండి 'మీసాల పిల్ల' అనే పాట ప్రోమోను విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందించగా, ఈ పాటను ప్రముఖ గాయకుడు ఉదిత్ నారాయణ ఆలపించారు. లిరికల్ సాంగ్‌ను సోమవారం రిలీజ్ చేయాల్సి ఉండగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. మంగళవారం సాయంత్రం ఈ పాటను విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ ట్వీట్ చేసింది. "చార్ట్‌బస్టర్ సాంగ్ కోసం సిద్ధంగా ఉండండి... ప్రతి భర్తకు, భార్యకు ఈ పాట కనెక్ట్ అవుతుంది. వెయిట్ అండ్ సీ!" అని పేర్కొంది.